క్లుప్తంగా

పోలింగ్‌బూత్‌లను పరిశీలించిన అధికారులు


బోనకల్‌లోని పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్: ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌బూత్‌లను తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ ఎల్ రాజు, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని 283, 284 బూత్‌లకు సంబంధించి అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

హస్తకళల చైర్మన్‌కు సత్కారం


రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యాన్ని సత్కరిస్తున్న వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: రాష్ట్ర హస్తకళల చైర్మన్‌గా నియమితుడైన వైరావాసి నాయుడు సత్యం శనివారం వైరా వచ్చిన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సూతకాని ఆయనను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయనను పూలమాల శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శేషగిరి, వెంకటేశ్వరరావు, గోవిందరావు, శ్రీను పాల్గొన్నారు.

హస్తకళల చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు..

కొణిజర్ల: రాష్ట్ర హస్తకళల చైర్మన్‌గా నియమితుడైన నాయుడు సత్యంను శనివారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కొణిజర్లలోని ఇండోఖతర్‌లో గల నాయుడు సత్యం ఇంటి వద్ద ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీను, నాయకులు రాయల పుల్లయ్య, శేషగిరి, మోష, వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

ప్రారంభమైన బీరమయ్య కొలుపు

కొణిజర్ల: కురమలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే బీరమయ్య కొలుపు మండలంలోని పెద్దమునగాలలో శనివారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా స్థానిక బీరప్ప దేవాలయంలో మైలపట్నం నిర్వహించారు. ఆదివారం ముత్యాలమ్మ బండి, బియ్యం కొలబట్టు వేడుకలు సాయంత్రం జల్డి (చెరువులో లింగాల వెతుకులాట) వేడుక, సోమవారం ఉదయం బీరప్ప, కామరావతి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్నట్లు కురమ పెద్దలు తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి

మధిర: మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇస్లావత్ సోమ్లానాయక్‌పై.. ముత్తినేని శ్రీనివాసరావు శనివారం దాడి చేశాడు. సోమ్లానాయక్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడి చేయటంతో బాధితుడు శ్రీనివాసరావుపై మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బాల్యవివాహం చేసిన వారిపై కేసు నమోదు

తల్లాడ: మండలంలోని గోపాలపేటకు చెందిన బాలికకు పెళ్లి చేసిన వారితో పాటు వరుడిపై శనివారం తల్లాడ పోలీసులు కేసు నమోదు చేశారు. గోపాలపేట కు చెందిన పదిహేనేళ్ల బాలికకు ఓ యువకుడితో ఈనెల 16న వివాహం జరిపించారు. ఈ విషయమై చైల్డ్‌లైన్ బాధ్యులకు ఫిర్యాదు అందగా శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హబీబున్నీసాబేగం బాలిక ఇంటికి వచ్చి సర్టిఫికెట్లు పరిశీలించడంతో మైనర్‌గా నిర్ధారణ అయింది. దీంతో బాలిక తల్లిదండ్రులు, యువకుడి తల్లిదండ్రులతోపాటు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండల్‌రావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏన్కూరు: మండల వ్యాప్తంగా పలుచోట్ల ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఉమకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏన్కూరు, తిమ్మారావుపేట, నాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇండస్ట్రీయల్ ఫీడర్‌లో..

తల్లాడ: మండలంలో ఇండస్ట్రీయల్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తల్లాడ విద్యుత్ శాఖాదికారి రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నారుగూడెం, తల్లాడ, గోపాలపేట, మల్లవరం గ్రామాల్లో పరిశ్రమలన్నింటికి విద్యుత్ సరఫరా బంద్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎండిపోయిన చెరువులు, కుంటలు

- అడుగంటిన భూగర్భ జలాలు..
- ఖరీఫ్ ఆలస్యమయ్యే అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు


పేరువంచలో పూర్తిగా ఎండిపోయిన చెరువు


నీరులేక ఎండిపోయిన పుల్లయ్యబంజరులోని చెక్‌డ్యాం

కల్లూరురూరల్: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు, కుంటలు ఎండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు సైతం ఇంకిపోయాయి. గత పది సంవత్సరాల కాలంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదని రైతులు వాపోతున్నారు. చెరువులు, కుంటలు ఎండిపోవటంతో పశువులు తాగేందుకు కూడా నీరులేక.. రైతులు తమ పశువులను బయటకు విడిచిపెట్టడం లేదు. అదే విధంగా చెరువులు, చెక్ డ్యామ్‌లు, కుంటలో నీరు ఇంకిపోవటం వల్ల బోర్ పంపుల్లో నీళ్లు రావడం లేదు. వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి ఎద్దడి ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

కల్లూరు ఇరిగేషన్ డివిజన్ పరిధిలో..

కల్లూరు ఇరిగేషన్ డివిజన్ పరిధిలోని తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, ముదిగొండ, చింతకాని, బోనకల్, ఎర్రుపాలెం, మధిర మండలాల్లో మొత్తం 514 చెరువులకు గాను ప్రస్తుతం 325 చెరువులు పూర్తి స్థాయిలో ఎండిపోయాయి. గతంలో చెరువులు, కుంటలు ఎండిపోయిన పరిస్థితులలో మార్చి, ఏప్రిల్ నెలలో నాగార్జునసాగర్ జలాలు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపేవారు. కానీ ఈ ఏడాది సాగర్ డ్యామ్‌లోనే నీళ్లు లేక పోవడం వల్ల చెరువులు, కుంటల్లో నీరు నింపే అవకాశం లేకుండా పోయింది. కల్లూరు ఇరిగేషన్ డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటలు, లిఫ్ట్ ఇరిగేషన్‌ల ఆయకట్టు కింద సుమారు 1.42 లక్షల ఎకరాలు సాగుబడి అవుతుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఖరీఫ్ సీజన్ సకాలంలో ప్రారంభం అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొదలుకాని వ్యవసాయ పనులు..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. ప్రతి ఏడాది జూన్, జులై నెలల్లో దుక్కులు దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించేవారు. జులై చివరి వారం నుంచి వరి నాట్లు మొదలు పెట్టేవారు. కానీ ఈ సీజన్లో జూన్, జులై నెలల్లో వ్యవసాయ పనులు చేపట్టలేని పరిస్థితి. జులై నెలలో వరి నార్లు వేయాలన్న నీరు లేదు. నీరు లేకపోతే వరి నార్లు ఎండిపోయే అవకాశం ఉండటంతో ఖరీఫ్ సీజన్‌లో వర్షాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జులై, ఆగస్టు నెలల్లో వర్షాలు సమృద్ధిగా పడి చెరువులు నిండితేనే వ్యవసాయ పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

పాడి రైతుల ఇబ్బందులు..

వేసవికాలంలో పశువులకు ఆరు బయట ప్రాంతాల్లో మేత సమృద్ధిగా దొరుకుతుంది. అదే విధంగా సమీపంలోని చెరువులు, కుంటల్లో పశువులు నీరు తాగి ఇళ్లకు చేరుతాయి. ఈ వేసవిలో అలాంటి పరిస్థితి లేక పోవటంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేత కోసం పశువులను ఉంచి పశుగ్రాసం వేసి నీరు పెట్టాలంటే రైతులకు భారంగా పరిణమించింది. కల్లూరు డివిజన్ పరిధిలో సుమారు 1.33 లక్షల పశువులున్నాయి. వీటికి పెంపకం ఈ వేసవిలో తీవ్ర సమస్యగా మారింది.

నార్లు పోసేందుకు కూడా నీరు లేదు..



నారు పోద్దామంటే చెరువుల్లో చుక్కనీరు లేకుండా ఎండిపోయాయి. దీంతో మళ్లీ వర్షాలు పడితేనే వరినార్లు పోసుకోగలుగుతాం. గత కొన్నేళ్లుగా చెరువుల్లో నీరు ఉండటం వల్ల ముందుగానే వరినారు పోసుకునే వాళ్లం. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. బోర్లు, చెక్‌డ్యాంల కింద సాగవుతున్న ఆయకట్టు పరిస్థితి కూడా ఈ విధంగానే ఉంది.

– శీలం నాగిరెడ్డి, రైతు, కప్పలబంధం

సాగర్ నీరు విడుదల చేయాలి..



సాగర్ డ్యాంలో ఉన్న నీటిని ముందస్తుగా చెరువులకు విడుదల చేసినట్లయితే సకాలంలో వరినార్లు వేయటానికి వీలుంటుంది. వర్షాలు పడి చెరువులు నిండిన తర్వాత నార్లు పోసుకోవాలంటే ఈ ఖరీఫ్ సీజన్ మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచన చేయాలి.

– తాళ్లూరి శ్రీనివాసరావు, రైతు, పెద్దకోరుకొండి

సత్ప్రవర్తన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకునేందుకు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించి మాట్లాడారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మంచి భవిష్యత్ కలిగి ఉండాలని అప్పుడే పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి వడ్డె లావణ్య మాట్లాడుతూ.. జైలు జీవితం ముగిశాక ఉత్తమపౌరులుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరి ఆదియ్య(ఆడమ్స్), న్యాయవాదులు బొర్రా వెంకట్రావ్, నల్లగట్ల విజయ్‌కుమార్, కిరణ్‌రంజని, అరుణకుమారి, జినతున్నీసాబేగం, సబ్‌జైల్ సూపరింటెండెంట్ ప్రవీణ్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


కొణిజర్ల: మాట్లాడుతున్న ఏడీఏ కరుణశ్రీ

కొణిజర్ల/ఏన్కూరు: నకిలీ విత్తనాలు అరికట్టడంలో డీలర్లు సహకరించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని వైరా ఏడీఏ కరుణశ్రీ హెచ్చరించారు. శనివారం తనికెళ్ల రైతు వేదిక భవనంలో విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విత్తన డీలర్లు తమ లైసెన్స్‌లు సకాలంలో రెన్యువల్ చేయించుకోవాలన్నారు. అదే విధంగా మండలంలోని జన్నారంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ పాల్గొని మాట్లాడారు. వ్యవసాయాధికారి నర్సింహారావు మూలపోచారం, తిమ్మారావుపేట గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువుల వాడి భూసారం పెంచుకోవాలని, గ్రామాల్లో గుర్తుతెలియన వ్యక్తులు విత్తనాలు విక్రయించేనట్లయితే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందిచాలన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రత అధికంగా ఉంటుందని, తగ్గిన తర్వాత రైతులు పత్తి, పెసర వంటి విత్తనాలు నాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నవ్య, అశోక్, లహరి, భవ్య, బాలకృష్ణ, రవికుమార్, వైరా నియోజకవర్గ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగయ్య

చింతకాని: విత్తనాల కొనుగోలు విషయంలో అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య రైతులకు సూచించారు. శనివారం మండలంలోని నాగులవంచ, రామకృష్ణాపురం, రాఘవాపురం, రేపల్లెవాడ, కోమట్లగూడెం, ప్రొద్దుటూరు, తిమ్మినేనిపాలెం, అనంతసాగర్ గ్రామాల్లో నకిలీ విత్తనాలపై నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, బీజీ–3 పేరుతో చలామణి అవుతున్న హెచ్‌టీ పత్తి విత్తనాలకు జీఈఏసీ అనుమతి లేనందున ఆ విత్తనాలను కొనుగోలు చేయరాదని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదును పొందాలని సూచించారు. రశీదుపై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, లాట్ నంబర్, గడువు తేదీ, డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తర్ణాధికారులు శ్రీకాంత్, నవీన్, హరికృష్ణ, రజిత, గోపి, చంద్రకళ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి..

బోనకల్: నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని కలకోట గ్రామంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక కంపెనీలు రైతులను మోసం చేసేందుకు దళారులతోని విత్తనాలను అమ్మిస్తున్నారని.. అలాంటి వారిపై అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు జక్కుల రామారావు, మాతంగి శ్రీనివాసరావు, పారుపల్లి నరసింహారావు, కొంగర బాస్కరరావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి అండగా నిలవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు అండగా నిలవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం కల్లూరు డీఎస్‌పీ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పట్టణాల్లో పట్టభద్రులను కలుసుకుని తీన్మార్ మల్లన్న ప్రజాసేవా కార్యక్రమాలను వివరిస్తూ అవినీతిపై మల్లన్న చేస్తున్న పోరాటాన్ని గురించి వివరిస్తూ పట్టభద్రులు ఓటు వేసే విధంగా చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కోఆర్డినేటర్ రాయల నాగేశ్వరరావు, నాయకులు మట్టా దయానంద్, పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్‌రావు, పెద్దబోయిన శ్రీను, బంకాబాబు, మాదిరాజు అన్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు ఎల్‌హెచ్‌పీఎస్ మద్దతు


మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

కల్లూరురూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఖమ్మం జిల్లా లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు దశరథ్‌నాయక్ తెలిపారు. హనుమాతండాలో శనివారం సాయంత్రం జరిగిన ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆయన గిరిజన పట్టభద్రులను, గిరి జన ఉద్యోగులను, వివిధ రంగాల్లో ఉన్న గ్రాడ్యుయేట్ గిరిజన యువతీ, యువకులను కోరారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ కృష్ణ నాయక్, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు పండు నాయక్, నందు నాయక్, భూక్యా రవినాయక్, ఇతర గిరిజన ప్రముఖులు పాల్గొన్నారు.

పరామర్శ..

వైరారూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాపాల నర్సింహారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గొల్లపూడి గ్రామంలో ఒక నిశ్చితార్థ వేడుకలో పాల్గొని వధువును ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, పాదిలి హరినాథ్, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన నాగేంద్రబాబు


నాగేంద్రబాబు

తల్లాడ: జాతీయ ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీల్లో మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన మాగంటి నాగేంద్రబాబు బంగారు పతకం సాధించారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్ పూర్తి చేసి ఏప్రిల్ 7 నుంచి 16 వరకు మణికర్ణిక హార్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీల్లో తన అద్భుత ప్రతిభతో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా నాగేంద్రబాబును శనివారం ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

రామారావు సేవలు చిరస్మరణీయం

తల్లాడ: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రామారావు సేవలు చిరస్మరణీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. తల్లాడ మండలం ముద్దునూరు గ్రామంలో శనివారం రామారావు దశ దిన కర్మకు హాజరై.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ నాయకులు రఘుపతిరెడ్డి, దయానంద్, కనకదుర్గ, సీతయ్య పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ


నూతనకల్ సొసైటీలో పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ తాజుద్దీన్, సిబ్బంది

తల్లాడ: మండలంలోని గంగదేవిపాడు ప్రాథమిక సహకార పరపతి సంఘం వద్ద శనివారం ఖరీఫ్ సీజన్ కోసం పచ్చరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎండి.తాజుద్దీన్ మాట్లాడారు. సొసైటీ పరిధిలోని గ్రామాలకు 100 క్వింటాళ్ల పిల్లిపెసర, జీలుగులు 1,400 క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. జీలుగులు 30 కిలోలు రూ.1116లు, పిల్లిపెసర 20 కిలోలు రూ.1,080 ధర ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డ్, పట్టాదార్ పాసు పుస్తకం జిరాక్స్ తీసుకొని రావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఆర్.త్రివేణి, డి.నాగేశ్వరరావు, ఎస్.కె.నాగుల్‌మీరా, ఎం.నాగేశ్వరరావు, సొసైటీ సీఈఓ రాకేష్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆంజనేయులు

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీ నిలబెట్టుకోలేదని ఏడు నెలల్లోనే ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై విరక్తి వచ్చిందని మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు విమర్శించారు. సత్తుపల్లిలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే ఒక వైపు.. షాడో ఎమ్మెల్యే మరో వైపు కలిసి దందా చేస్తూ మట్టి మాఫియా చేస్తున్నారని ఆరోపించారు. అన్ని రకాల అక్రమాలు చేస్తూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యాసంస్థలపై దౌర్జన్యాలకు పాల్పడుతూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, ఇవి బీజేపీ పార్టీ ముందు సాగవని హెచ్చరించారు. కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా ఈ పదవి వచ్చిందని విమర్శించారు. భట్టభద్రులందరు రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, ఈ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపొందటం ఖాయమన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బాణాల లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శులు నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, భాస్కర్ల వీరంరాజు, పాలకొల్లు శ్రీను, నాగస్వామి, విజయ్, నాగరాజు, సుబ్రమణ్యం, నెహ్రూ పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డిని గెలిపించాలి..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య


ప్రచారంలో జెడ్పీ చైర్మన్, నాయకులు

సత్తుపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడైన బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. స్థానిక క్యాంప్ ఆఫీస్‌లో శనివారం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బ్లాక్‌మెయిలర్ తీన్మార్‌మల్లన్న నిజస్వరూపం ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. సేవాగుణం కలిగిన రాకేష్‌రెడ్డికి అతనికి మధ్య బేధాలను ఓటర్లకు వివరించాలని పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, యాగంటి శ్రీనివాసరావు, కొత్తూరు ఉమా, దొడ్డా శంకర్‌రావు, ఎస్‌కె రఫీ, పగుట్ల వెంకటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

మధిర: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ కోరారు. మండలంలోని మాటూరు, మాటూరుపేట, నాగవరప్పాడు, మర్లపాడు గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాసరావుతో పాటు చిత్తారు నాగేశ్వరరావు, అడపాల వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి నాగిరెడ్డి, మారంపూడి ప్రసాద్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రచార పర్వం

రాకేష్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ప్రచారం

కల్లూరు: ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ.. బీఆర్‌ఎస్ నాయకులు నమూనా పత్రాలతో శాంతినగర్, మధిర రోడ్, ఏకలవ్య కాలనీలోని పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాచమళ్ళ నాగేశ్వరరావు, ఖమ్మంపాటి పుల్లారావు, కొరకొప్పు ప్రసాద్, యంగళ వెంకటేశ్వర్లు, కొత్తపల్లి ఏసు, ఖమ్మంపాటి నాగేశ్వరరావు, నల్లగట్ల మారయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను గెలిపించాలని..


ఎర్రుపాలెం: ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ/ఎర్రుపాలెం: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లన్న గెలుపును కాంక్షిస్తూ.. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. శనివారం తల్లాడ, ఎర్రుపాలెం మండల కేంద్రాల్లోని ఓటర్ల వద్దకు వెళ్లి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సదర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ తమ ఓటును మల్లన్నకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రులకు కాంగ్రెస్ పార్టీనే న్యాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారావు, షేక్ ఇస్మాయిల్, లక్ష్మణరావు, అనుమోలు కృష్ణారావు, సూరంశెట్టి భాస్కర్ రావు, కడియం శ్రీనివాసరావు, కంచర్ల వెంకటనర్సయ్య, సగ్గుర్తి వెంకటనారాయణ, గుడేటి బాబురావు, శీలం వెంకట్రామిరెడ్డి, పిల్లి బోసు మొగిలి అప్పారావు, గుర్రాల పుల్లారెడ్డి, సూరంశెట్టి రాజేష్, షాభాష్, నాగరాజు, బాజీ, మెట్టు కృష్ణ, పి.శ్రీనివాసరావు, బొక్కా భాస్కర్, కూరపాటి నాగేశ్వరావు, చిన్నం రాము, దగ్గుల రఘుపతిరెడ్డి, మార్నెళ్ల మల్లిఖార్జున్‌రావు, రత్తయ్య, జోసఫ్, తాళ్ల వెంకటేశ్వర్లు, ఇతర సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి జలాభిషేకం


జలబిందెలతో మాలధారులు

మధిర: మండలంలోని మడుపల్లి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ మాలధారులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి మల్లవరపు వాసు ఆధ్వర్యాన స్వామికి జలాభిషేకం నిర్వహించారు. హైస్కూల్ నుంచి ఆలయం వరకు జలబిందెలను వెళ్లి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు, మాలధారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపును కాంక్షిస్తూ..


ఏన్కూరు: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఏన్కూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరావు కోరారు. మండల పరిధిలోని తూతకలింగన్నపేట, ఏన్కూరు, అంబేడ్కర్ నగర్‌కాలనీ, మేడిపల్లి గ్రామాల్లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు కలసి బీజేపీ ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లమోతుల రమేష్, మోరబోయిన కృష్ణ పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు, శ్రీనివాస్, ఎల్లంకి సుదాకర్, బాబు పాల్గొన్నారు.